క్లుప్తంగా

పేర్ని నాని దీపావళి శుభాకాంక్షలు



కోనేరుసెంటర్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అని, ఈ దీపావళిని జిల్లా ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆకాంక్షించారు. కోటి కాంతుల చిరునవ్వులతో అందరి జీవితాలు సుఖమయం కావాలని కోరుకుంటూ జిల్లా ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత

మచిలీపట్నంటౌన్: 46వ డివిజన్‌కు చెందిన జోగి శ్రీను ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణ సాయంగా శ్రీను భార్య నాగలక్ష్మికి రూ. 10 వేలను కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి శనివారం అందజేశారు. మిగిలిన రూ. 90 వేలు అకౌంట్‌లో జమ అవుతాయని చెప్పారు.

రియాజ్ హుస్సేన్‌కు పురస్కారం



మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకుడు మీర్జా రియాజ్ హుస్సేన్ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల సందర్భంగా శనివారం డెమొక్రటిక్ పీఆర్టీయూ విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో మచిలీపట్నానికి చెందిన రిటైర్డ్ ఉర్దూ ఉపాధ్యాయుడు రియాజ్ హుస్సేన్ ఈ పురస్కారాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి. కల్పలతారెడ్డి, డీఈఓ తాహెరా సుల్తానా చేతుల మీదుగా అందుకున్నారు. రియాజ్ హుస్సేన్‌ను పలువురు అభినందించారు.

నరకాసుర దహనం



నడకుదురు(చల్లపల్లి): నరకాసుర సంహార క్షేత్రంగా భాసిల్లుతున్న చల్లపల్లి మండలం నడకుదురులోని ప్రాచీన పుణ్యక్షేత్రం పృథ్వీశ్వరస్వామి దేవస్థానంలో నరక చతుర్దశి నిర్వహించారు. ఆలయంలో పృథ్వీశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో నరకాసుర దహనం కార్యక్రమం కోలాహలంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నరకాసుర దహనాన్ని తిలకించారు. గ్రామ పెద్దలు మల్లుపెద్ది త్రివిక్రమరావు, వేద పండితులు పాల్గొన్నారు.

పశువులకు అడ్డాగా రహదారులు

- రోడ్లపై తిష్టవేస్తున్న వైనం
- ట్రాఫిక్‌కు అంతరాయం
- ప్రజల ఇబ్బందులు



రహదారిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న పశువులు

పెడన: పెడన పట్టణంలోని ప్రధాన రహదారులు పశువుల అడ్డాగా మారుతున్నాయి. రాత్రీ, పగలు తేడా లేకుండా వాహనాలకు ఇవి అడ్డు పడుతున్నాయి. గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. కొన్ని పశువులు రోడ్లపై అడ్డంగా పడుకుంటున్నాయి. హారన్ కొట్టినా అవి లేవడం లేదు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యాసంస్థలు, ఆఫీసులకు వెళ్లి, వచ్చే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడ వాటిని ఢీ కొట్టి పడిపోతామనే భయం వారిని వెంటాడుతోంది. పగటి సమయంలో కనిపిస్తున్నా వాటిని తప్పించుకుని వెళ్లే సరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోతుందనే ఆందోళన ప్రయాణికుల్లో, విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి వాటిని బంధించి మూడు రోజులు ఆహారం పెట్టినా పశువులు మావే అంటూ సంబంధిత యజమానులు రాకపోవడం విశేషం. అవి స్థానికులకు చెందినవేనా...లేక ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ తిష్టవేశాయా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

స్పందనలో ఫిర్యాదులు..

రోడ్ల వెంబడి తిరుగుతూ పాదచారులను, వాహన చోదకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వీటి సమస్య నుంచి తమను కాపాడాలని స్పందన కార్యక్రమంలోనూ, పోలీసులకు పలు దఫాలుగా పలువురు ఫిర్యాదులు చేశారు. వాటిని బంధించి ఉంచినా యాజమానులు రాకపోవడంతో ఎవరికి వారు మిన్నకుండిపోతున్నారు.

త్వరలో సమస్యకు పరిష్కారం

పశువుల సమస్యపై మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర మాట్లాడుతూ తిరుగుడుకు అలవాటు పడిన ఈ పశువులను గోసాల వారు కూడా తీసుకోవడం లేదని చెప్పారు. సమస్య మరింత తీవ్రం కాకుండా పోలీస్ వారితో సమన్వయం చేసుకుని త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా పడుకుంటున్నాయి



రాత్రి సమయంలో అయితే ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా పడుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు పక్క నుంచి వెళ్లిపోతున్నారు. పెద్ద వాహనాలు వచ్చిన సమయంలో హారన్ కొట్టి నా అవి కదలడం లేదు. కండక్టర్ లేదా ప్రయాణికుడు లేదా క్లీనర్ దిగి వచ్చి వాటిని పక్కకు తోలి వాహనాలను ముందుకు పోనిస్తున్నారు. ఒక్కోసారి వాటిల్లో అవి కుమ్ముకుని ఎక్కడ మీదకు వస్తాయనే భయం వెంటాడుతోంది.

– వీరంకి రాజేష్, పెడన

బడుల సమయంలో పోలీసులుంటున్నారు



పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు వెళ్లే సమయంలో పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఆ సమయాల్లో తప్ప మిగిలిన సమయాల్లో ఉండటం లేదు. దీంతో ట్రాఫిక్‌కు మధ్యమధ్యలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. అలాగే పశువులు కూడా అడ్డంగా ఉంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆటో డ్రైవర్లు సైతం ఇష్టానుసారంగా నిలుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు.

– భట్ట పైడేశ్వరరావు, 4వ వార్డు, పెడన

సమస్యను పరిష్కరిస్తాం



రోడ్లపై పశువుల సంచారం సమస్య మచిలీపట్నంలోనే ఉందనుకున్నా. పెడనలో కూడా ఉంటే ఆ సమస్యను మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేలా చూస్తాం. అలాగే పాఠశాలల సమయంలో కాకుండా ఇతర సమయంలో ట్రాఫిక్ నిలిచిన సమయంలో సమాచారం ఇస్తే తక్షణం ఆ సమస్యను పరిష్కరిస్తాం.

– షేక్ హబీబ్‌బాషా, సీఐ, పెడన

ఆజాద్ సేవలు చిరస్మరణీయం

- ఘనంగా ఆజాద్ జయంతి
- పలు ప్రాంతాల్లో ఘన నివాళి



బందరులో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళి



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బందరులోని ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

మచిలీపట్నంటౌన్: స్వాతంత్య్ర సమర యోధుడు, విద్యావేత్త, సంఘ సంస్కర్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చిరస్మరణీయమైన సేవలు అందించారని పలువురు వక్తలు అన్నారు. ఆజాద్ జయంతి కార్యక్రమం నగరంలోని పలు సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక బీసీ సంఘ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆజాద్ చిత్ర పటానికి చైతన్య వేదిక సలహాదారు అహ్మద్ అలీ, బైరాగులపల్లి సినిమా దర్శకుడు జాన్ థామస్ పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఆజాద్ భారతదేశానికి తొలి విద్యా శాఖ మంత్రిగా పనిచేసి విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. దేశంలో విభిన్న మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ మనమంతా ఒక్కటేనంటూ హిందూ, ముస్లిం ఐక్యతకు ఆజాద్ కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు షేక్ అమీర్, ప్రధాన కార్యదర్శి ఎంపీ మునావర్, మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు హసీం బేగ్, ప్రధాన కార్యదర్శి అబేద్‌అలీ, జిల్లా న్యాయ సలహాదారు ఎండీ మస్తాన్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కేవీవీ సత్యనారాయణ, మైనార్టీ నాయకులు షేక్ మౌలాలి, అబ్దుల్ అజీం, జైరుల్‌ఖాద్రీ, నూర్ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని పుట్లమ్మ చెరువుల వద్ద ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి ఎలక్ట్రికల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

● ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆజాద్ జయంతి కార్యక్రమం స్థానిక ఇనుగుదురుపేటలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సదరుద్దీన్ ఖురేషి పూలమాల వేసి నివాళులర్పించారు. సదరుద్దీన్ మాట్లాడుతూ ఆజాద్ సేవలను కొనియాడారు. ఆజాద్ జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు.

ఆజాద్‌కు నివాళి..

అవనిగడ్డ: ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావులు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తొలి విద్యా శాఖా మంత్రిగా దేశానికి ఆజాద్ చేసిన సేవలను కొనియాడారు.

విద్యారంగంలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో లంకమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, పలువురు నాయకులు, ముస్లిం మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ రావాలి



చెన్నూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు



చిరు వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

పెడన: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, ఆయనే మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండవీటి నాగబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం చెన్నూరులో శనివారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి జగన్ ప్రభుత్వంలో జరిగిన మేలు వివరించి ప్రజల మద్దతు కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, గరికిపాటి వెంకట రామానాయుడు, పామర్తి సాంబశివరావు, శివరామ్, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి..

కృత్తివెన్ను: సీతనపల్లి సచివాలయ పరిధిలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్వహించారు. రాత్రి అదే గ్రామంలో నిద్రకు ఉపక్రమించారు. ఇంటింటికి వెళ్లి గడిచిన నాలుగున్నరేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అందించిన సంక్షేమాన్ని ప్రజలంతా గమనించాలన్నారు. భవిష్యత్‌లో మరింత సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరాన్ని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పి. మహేష్, సర్పంచ్ సునీత తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

కోనేరుసెంటర్: రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని చిన్నాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి చంద్రబాబు పాలనకు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు వ్యత్యాసాన్ని వివరించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. ప్రతిఒక్కరూ జగనన్నకు మద్దతుగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు, నియోజకవర్గ కన్వీనర్ శొంఠి ఫరీద్, మాజీ ఎంపీటీసీ తోట వాసు, చిన్నాపురం గ్రామ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి కార్తిక మాసోత్సవాలు

నాగాయలంక: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు శనివారం తెలిపారు. నిత్యం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మట్టి శివలింగాలతో సామూహిక పూజలు, అఖండ కర్పూర జ్యోతి వంటి ఆధ్యాత్మిక విశేష పూజలు, కార్తిక అన్నసంతర్పణలు, వన సమారాధనలు నిర్వహిస్తామని చెప్పారు. స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద కృష్ణానదిలోని రామలింగేశ్వర స్వామి మండపంలో నెల రోజుల పాటు స్వామి వారికి నిత్య నవ హారతులు, ప్రతి సోమవారం భక్తులకు కార్తిక భోజనాలు, ప్రత్యేక ఆధ్యాత్మిక పూజలు నిర్వహిస్తామని క్షేత్రం చైర్మన్ లయన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతి రోజూ స్వామి వారికి నిత్య అభిషేకాలు జరుగుతాయన్నారు. 19న మహాలింగార్చన, 26న లక్ష్మీగణపతి గౌరీ సహిత రుద్రహోమం, జ్వాలా తోరణం, డిసెంబరు 3న శాంతి కల్యాణం, 7న ఆలయ ప్రాంగణంలోని 35 అడుగుల ధ్యానముద్రలో ఉన్న శివుని విగ్రహం వద్ద కోటి దీపోత్సవం, 10న అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన, రాత్రికి అన్నసమారాధన, 11న సహస్ర దీపారాధన జరుగుతాయని వివరించారు.

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తిక మాసోత్సవాలు ఈ నెల 14 నుంచి జరుగుతాయని వేద పండితులు గుండెపూడి నాగ రాజశేఖర శర్మ తెలిపారు. డిసెంబర్ 10 నుంచి 13 వరకు రుద్రహోమం ఆలయ ప్రాంగణంలో జరుగుతుందన్నారు. డిసెంబర్ 11 నుంచి స్వామివారి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకుని కల్యాణం, 12న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూర్ణాహుతి సాయంత్రం 6 గంటలకు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణం, అనంతరం నిరాజన మంత్రపుష్పాలతో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 13న ఉదయం 5 గంటలకు గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఊరేగింపు, అవబృధ స్నానం, పోలిని స్వర్గానికి పంపడం జరుగుతుందని వివరించారు.

ఎన్‌టీఎఫ్ వితరణ

వక్కలగడ్డ(చల్లపల్లి): గ్రామానికి చెందిన బొడ్డు సీతారామయ్య కుటుంబానికి నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నాయకులు ఆర్థిక సాయం చేశారు. సీతారామయ్య శనివారం మృతి చెందగా, ఆయన భార్య యశోదకు ఎన్‌టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరకొండ నాగలక్ష్మయ్య రూ.5 వేలు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుంభా లక్ష్మయ్య, సాంబయ్య, కట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి సాయం



పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ బీసీ కాలనీకి చెందిన దివ్యాంగురాలు నాగిడి శివగంగకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్‌నాయుడు రూ.7 వేలు ఆర్థిక సహాయం అందించారు. గత కొద్ది రోజుల నుంచి మెడ నరాల వ్యాధితో ఆమె బాధపడుతూ లేవలేని స్థితిలో ఉంది. పాస్టర్ విలియం కేరీ, నాగిడి శివ, రాంబాబు, తమ్మా సురేష్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల వద్ద సందడి



పెడనలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు



బందరు ఏజే కళాశాలలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేట ఆంధ్ర జాతీయ కళాశాల ప్రాంగణంలో దీపావళి టపాసుల దుకాణాల వద్ద కొనుగోలు దారులతో సందడి నెలకొంది. శుక్రవారం రాత్రి నుంచి దుకాణాలు ఏర్పాటు చేయడంతో శనివారం టపాసుల విక్రయాలు ప్రారంభమయ్యాయి. వాతావరణం అనుకూలించడంతో టపాసుల ధరలకు రెక్కలొచ్చాయి. టపాసుల రేట్లు అధికంగా ఉన్నాయని కొనుగోలుదారులు చెబుతున్నారు. వర్షం లేకపోవడం, వాతావరణం పొడిగా ఉండటంతో శని, ఆదివారాల్లో టపాసుల విక్రయాలు జోరుగా జరుగుతాయని వ్యాపారులు ఆశిస్తున్నారు.

నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్స్‌లో శనివారం బాణ సంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జె.విమలకుమారి ఆధ్వర్యంలో పోలీస్, ఫైర్ అధికారులతో కలిసి నిబంధనల మేరకు లైసెన్స్‌దారులకు లేఅవుట్ నిర్దేశించారు. పండుగ ఆదివారం కావడంతో శని, ఆదివారాలు విక్రయాలు బాగుంటాయని వ్యాపారులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది 16 దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సులు జారీ చేశామని తహసీల్దార్ తెలిపారు.

తహసీల్దార్ పరిశీలన..

పెడన: బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పి. మధుసూదనరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుకాణాల ఏర్పాటుకు 15 మంది దరఖాస్తు చేసుకోవడంతో నిబంధనల మేరకు దుకాణాలు పెట్టుకోవాలని సూచించామన్నారు. ఫైర్, పోలీస్ వారు పేర్కొన్న విధంగా పట్టణానికి శివారులోని బైపాస్ రోడ్డులో దుకాణాలు పెట్టించామని చెప్పారు. శనివారం మధ్యాహ్నం పెడన ఎస్ఐ–2 ప్రసాదరావు దుకాణాలను పరిశీలించారు.

11 స్టాల్స్‌కు అనుమతి..

కోడూరు: దీపావళి టపాసులు విక్రయించేందుకు మండలంలో 11 స్టాల్స్‌కు అనుమతించామని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా శనివారం తెలిపారు. అన్నం కిషోర్ మిల్లు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో టపాసులకు అనుమతించామన్నారు. వ్యాపారులు నిబంధనలకు లోబడి టపాసులను విక్రయించాలన్నారు. ఎస్ఐ రాజేంద్రప్రసాద్ స్టాల్స్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించి, వ్యాపారులకు పలు సూచనలిచ్చారు.

నిబంధనలు పాటించాలి

గూడూరు తహసీల్దార్ విజయప్రసాద్



బాణసంచా విక్రయ కేంద్రంలో ఏర్పాటు చేసిన షామియానాను తొలగింపజేస్తున్న తహసీల్దార్

గూడూరు: బాణసంచా విక్రయదారులు నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. గూడూరు, పోలవరం, రాయవరం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలను శనివారం తహసీల్దార్ పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణదారులు షామియానాలు ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దగ్గరుండి వాటిని తొలగింపజేశారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సర్వేయర్ జి.వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.